# ఎల్కతుర్తిలో దొంగల బీభత్సం



ఎల్కతుర్తి : లక్ష్మీనారాయణ ఇంటి డోర్‌కు డ్రిల్‌తో రంధ్రం చేసిన దొంగలు



దొంగల చేతిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మీనారాయణ

- 4 ఇళ్లల్లో వరుస దొంగతనాలు
- 15 తులాల బంగారు ఆభరణాలు, ముత్యాల సెట్, డైమండ్ కమ్మలు, రూ. లక్షా 5వేల నగదు అపహరణ
- అడ్డు వచ్చిన కుటుంబసభ్యులను చితకబాదిన దుండగులు
- చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించిన డీసీపీలు బారి, మురళీధర్

ఎల్కతుర్తి, అక్టోబర్ 8 : మండల కేంద్రంలో శనివారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. నాలుగు ఇండ్లల్లో దొంగతనం చేసి అడ్డువచ్చిన కుటుంబసభ్యులను చితకబాదారు. సుమారు రూ. 8లక్షల బంగారు ఆభరణాలతో పాటు రూ. లక్షా 5వేల నగదును అపహరించారు. ఎల్కతుర్తి పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దామెర గ్రామానికి చెందిన మాడేటి శ్రీలత- లక్ష్మీనారాయణ దంపతులు ఎల్కతుర్తిలో ఇల్లు అద్దెకు తీసుకొని నివసిస్తున్నారు. శనివారం అర్ధరాత్రి 2.45 గంటల ప్రాంతంలో దొంగలు ఇంటి మెయిన్ డోర్‌కు డ్రిల్ మిషన్‌తో రంధ్రం చేసి డోర్ ఓపెన్ చేసి వారు నిద్రిస్తున్న రూములోకి చొరబడ్డారు. శబ్దానికి నిద్రలేచిన శ్రీలత, లక్ష్మీనారాయణ ఎవరు అని అరుస్తుండగానే కర్రతో లక్ష్మీనారాయణను విచక్షణారహితంగా కొట్టారు. శ్రీలత ఒంటి మీద ఉన్న 40 గ్రాముల పుస్తెలతాడు, 60 గ్రాముల బంగారు గాజులతో పాటు లక్ష్మీనారాయణకు చెందిన 15 గ్రాముల చెయిన్‌ను లాక్కున్నారు. అలాగే బీరువాలోని 4 గ్రాములు, 16 గ్రాముల చెయిన్లతో పాటు 12 గ్రాముల చెవి కమ్మలు, రూ. 80వేల విలువైన డైమండ్ కమ్మలు, రూ.లక్ష విలువైన ముత్యాల సెట్, రూ.లక్ష నగదు ఎత్తుకెళ్లారు. లక్ష్మీనారాయణ ఇంట్లో దొంగతనం చేసేముందుగానే విద్యానగర్ కాలనీకి చెందిన మాడుగుల ప్రేమయ్య ఇంట్లో కిరాయికి ఉంటున్న బీఫార్మసీ విద్యార్థుల రూము తాళం పగులకొట్టి దొంగతనానికి ప్రయత్నించి ఎవరూ లేకపోవడంతో బట్టలను చిందరవందర చేశారు. అనంతరం అదే రూము పక్కన కిరాయికి ఉంటున్న కావటి రాజ్‌కుమార్ రూం తాళం పగులకొట్టి 10 గ్రాముల కమ్మలు, చెంగెల్లి శ్రీనివాస్ ఇంట్లో రూ. 5వేల నగదు తస్కరించారు. బాధితులు ఎల్కతుర్తి పోలీసులకు సమాచారం అందించారు. గాయాలపాలైన లక్ష్మీనారాయణను ఆస్పత్రికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న సెంట్రల్ జోన్ డీసీపీ బారి, క్రైం డీసీపీ మురళీధర్, క్రైం ఏసీపీ మల్లయ్య, కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్, ఎల్కతుర్తి సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై రాజ్‌కుమార్ ఘటనా స్థలాలకు వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి వివరాలు సేకరించారు. చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. అయితే పలుచోట్ల సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో నిందితుల ఆచూకీ లభించలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

### రెండు హుండీల్లోని కానుకల అపహరణ..

ఖిలావరంగల్ : శివనగర్‌లోని సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు ఆలయ కమిటీ తెలిపింది. సుమారు రాత్రి 12 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆలయ ప్రాంగణంలోని సీసీ కెమెరాలకు బబుల్‌గమ్ అతికించి తాళాలను కటర్‌తో కట్ చేశాడు. ఆలయంలోని రెండు హుండీలను పగులగొట్టి అందులో ఉన్న సుమారు రూ.2 లక్షలకుపైగా కానుకలను అపహరించినట్లు ఆలయ కమిటీ సభ్యులు మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చెన్నారావుపేట, అక్టోబర్ 8 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని రామన్‌కుంట తండా వద్ద శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెక్కొండ మండలం పనికర గ్రామానికి చెందిన బండారి పవన్(24) ద్విచక్ర వాహనంపై అమీనాబాద్‌లోని అత్తవాళ్ల ఇంటికి వెళ్లి వస్తుండగా, రామన్‌కుంట తండా వద్ద బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో పవన్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నర్సంపేట ఏరియా హాస్పిటల్‌కు తరలించినట్లు ఎస్సై తోట మహేందర్ తెలిపారు.

### గ్యాస్ సిలిండర్ పేలి మహిళ..

కమలాపూర్, అక్టోబర్ 8 : మండలంలోని భీంపల్లి గ్రామానికి చెందిన పసుల రాజమ్మ (70) గ్యాస్ సిలిండర్ పేలి తీవ్రంగా గాయపడి ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ సంజీవ్ ఆదివారం తెలిపారు. టీ చేసేందుకు గ్యాస్ వెలిగిస్తుండగా సిలిండర్ పేలి రాజమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చెప్పారు. కొడుకు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

### గుండెపోటుతో రికార్డ్ అసిస్టెంట్..



సతీశ్(ఫైల్)

సుబేదారి, అక్టోబర్ 8 : వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో రికార్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కోమకుల సతీశ్ గత రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. శనివారం కార్యాలయంలో విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న సమయంతో ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో సహోద్యోగులు స్థానిక ప్రైవేట్ దవాఖానకు తరలించారు. డాక్టర్లు పరిశీలించి సతీశ్ అప్పటికే మృతిచెందినట్లు ధృవీకరించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రికార్డ్ అసిస్టెంట్ మృతికి పోలీస్ పరిపాలనా విభాగం ఉద్యోగులతో పాటు సీపీ ఏవీ రంగనాథ్ సంతాపం తెలిపారు. పరిపాలనా విభాగం డీసీపీ రాగ్యానాయక్‌తో పాటు ఉద్యోగులు, పోలీస్ అధికారుల సంఘం సభ్యులు ఆదివారం ఆయన నివాసానికి వెళ్లి సతీశ్ మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అంత్యక్రియల ఖర్చుల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 20వేలు అందజేశారు.

## 'ములుగు' ఇన్‌చార్జిగా ఎమ్మెల్సీ పోచంపల్లి



ములుగు, అక్టోబర్ 8(నమస్తేతెలంగాణ) : ములుగు నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జిగా ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. ములుగు బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి గెలుపు కోసం ఎన్నికల సమన్వయానికి శ్రీనివాస్‌రెడ్డిని సీఎం కేసీఆర్ నియమించారు. ఎమ్మెల్సీ రామప్ప దేవాలయ అభివృద్ధి కోసం గతంలో ప్రత్యేక నిధులు కేటాయించారు. ములుగు అభ్యర్థి గెలుపు కోసం ఇప్పటికే ప్రతి మూడు మండలాలకో ఇన్‌చార్జిని నియమించగా, వారు మండలాల వారీగా ఎన్నికల సన్నాహక సమావేశాలను నిర్వహించారు. ప్రస్తుతం శ్రీనివాస్‌రెడ్డిని నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించడంతో బీఆర్ఎస్ నాయకుల్లో కొత్త ఉత్సాహం నెలకొన్నది.

## హడప్సర్ ఎక్స్‌ప్రెస్ షెడ్యూల్ విడుదల

- వారంలో మూడు రోజులు కాజీపేటకు రాకపోకలు
- ప్రయాణికులకు పుణె వరకు నేరుగా రైలు సౌకర్యం

కాజీపేట, అక్టోబర్ 8 : కాజీపేట నుంచి ఈ నెల 9వ తేదీ నుంచి నడువనున్న హడప్సర్ ఎక్స్‌ప్రెస్ రైలు షెడ్యూల్ టైమింగ్‌ను దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. హైదరాబాద్-పుణె-హైదరాబాద్ మధ్య వారంలో మూడు రోజులు రాకపోకలు సాగించే 17014/17013 హడప్సర్ ఎక్స్‌ప్రెస్ రైలును కాజీపేట జంక్షన్ వరకు పొడిగించారు. ఈ రైలు కాజీపేట నుంచి ప్రతి సోమ, గురు, శనివారాల్లో సాయంత్రం 6:15 గంటలకు బయలుదేరి సికింద్రాబాద్‌కు రాత్రి 8:25 గంటలకు చేరుకుంటుంది. అక్కడి నుంచి బయలు దేరి మర్నాడు ఉదయం 10:50 గంటలకు పుణె (హడప్సర్) రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ప్రతి మంగళ, శుక్ర, ఆదివారాల్లో పుణె రైల్వే స్టేషన్ నుంచి మధ్యాహ్నం 3:30 గంటలకు బయలుదేరి కాజీపేటకు మరుసటి రోజు ఉదయం 6:45 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. రైలు జనగామ, భువనగిరి స్టేషన్లలో ఆగుతుందని చెప్పారు.

### ఉరేసుకొని మహిళ ఆత్మహత్య




సుధ (ఫైల్)

ఎల్కతుర్తి, అక్టోబర్ 8 : మండలంలోని దామెర గ్రామానికి చెందిన పాటి సుధ(45) ఆదివారం తెల్లవారుజామున ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. సుధ కొంతకాలంగా ఫిట్స్‌తో బాధపడుతున్నది. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినప్పటికీ నయం కాలేదు. దీంతో జీవితం మీద విరక్తి చెంది ఇంట్లో ఉరేసుకున్నది. గమనించిన భర్త ప్రకాశ్ వెంటనే ఆమెను కాపాడే ప్రయత్నం చేశాడు. అప్పటికే మృతి చెందింది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఉండగా, వారికి పెళ్లిళ్లు చేశారు. మృతురాలి సోదరుడు చంద్రమౌళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## కోటగుళ్లు, పాండవుల గుట్టను సందర్శించిన వలంటీర్స్

వెంకటాపూర్, అక్టోబర్ 8 : పాలంపేట గ్రామంలోని రామప్ప హరిత హోటల్‌లో వరల్డ్ హెరిటేజ్ వలంటీర్స్‌కు శిక్షణ కార్యక్రమం కొనసాగుతున్నది. ఆదివారం పాత గెస్ట్ హౌస్ ఆవరణలో యోగా గురువు రాంబాబు గంట పాటు శిక్షణ ఇచ్చారు. అనంతరం క్యాంపెయిన్‌లో భాగంగా భూపాలపల్లి జిల్లాలోని కోటగుళ్లు(గణపేశ్వరాలయం), గణపసముద్రం, పాండవుల గుట్టను సందర్శించారు. డెక్కన్ అకాడమీ చైర్మన్ వేదకుమార్ కెపాసిటీ బిల్డింగ్, సిస్టమ్ అప్రోచ్ ఇన్ కన్జర్వేషన్ అండ్ ప్రిజర్వేషన్‌పై వివరించారు. కార్యక్రమంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యుడు శ్రీధర్‌రావు, సేవా టూరిజం అధ్యక్షుడు కుసుమ సూర్యకిరణ్, కేయూ స్కాలర్ కొక్కుల ప్రశాంత్, ట్రస్టు సభ్యుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.



పాండవుల గుట్ట వద్ద వలంటీర్స్‌తో ఎం వేదకుమార్

## విద్యార్థులపై దాడి.. తొమ్మిది మందిపై కేసు

సుబేదారి, అక్టోబర్ 8 : ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థులపై దాడి చేసిన తొమ్మిది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 6న సుబేదారి బాలుర ఎస్టీ హాస్టల్ విద్యార్థులు ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించుకోవడానికి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో డెకరేషన్ చేస్తున్నారు. ఈ సమయంలో హాస్టల్ విద్యార్థి సచిన్ తన క్లాస్‌మేట్ అమ్మాయికి ఫోన్‌తో పాటు మెసేజ్ చేశాడని గుర్తు తెలియని వ్యక్తులు అక్కడికి వచ్చి సచిన్‌తో పాటు సుమతేజ, రాజేందర్‌తో ఘర్షణకు దిగారు. మళ్లీ కొంత సమయం తర్వాత హాస్టల్‌లో చొరబడి కర్రలతో కొట్టడంతో ఇస్లావత్ వెంకన్న, అఖిల్‌కు గాయాలయ్యాయి. హాస్టల్ వార్డెన్ ఫిర్యాదు చేయడంతో విద్యార్థులపై దాడిచేసిన ప్రదీప్, సిద్ధు, రజినీకాంత్, రమేశ్, అభి, భాను, సాయి, తరుణ్, అశ్విన్‌పై అదనంగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### నేటి పోలీస్ గ్రీవెన్స్ రద్దు

సుబేదారి, అక్టోబర్ 8 : వరంగల్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు సీపీ ఏవీ రంగనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలనా పరమైన కారణాలతో గ్రీవెన్స్‌ను నిర్వహించడం లేదని పేర్కొన్నారు. ప్రజలు గమనించి ఫిర్యాదులు అందజేయడానికి కమిషనరేట్‌కు రావొద్దని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

### నేడు వాహనాల వేలం..

సుబేదారి : వివిధ కేసుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలను సోమవారం సీటీసీ కార్యాలయంలో వేలం వేస్తున్నట్లు సీపీ ఒక ప్రకటనలో తెలిపారు. 19 ద్విచక్ర వాహనాలను మడికొండలోని సీటీసీ కార్యాలయంలో వేలం వేస్తున్నట్లు చెప్పారు. వేలంలో పాల్గొనే వారు ఉదయం 8 గంటలకు సీటీసీ కార్యాలయానికి రావాలని సూచించారు.

## బైక్ ఢీకొని బాలుడికి గాయాలు

**మెరుగైన వైద్యం కోసం హనుమకొండకు తరలింపు**

వాజేడు, అక్టోబర్ 8 : గుర్తుతెలియని ద్విచక్రవాహనం ఢీకొని బాలుడికి తీవ్రగాయాలైన ఘటన మండలంలో ఆదివారం జరిగింది. మండల కేంద్రానికి చెందిన బాలుడు చిడెంపల్లి రోహిత్ మిర్చి చేను వద్దకు నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో 163 జాతీయ రహదారిపై గుర్తుతెలియని బైక్ చర్చి సమీపంలో ఢీకొట్టగా, తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాలుడిని వాజేడు పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తండ్రి సాంబయ్య హనుమకొండలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించాడు.

### వాహనం ఢీకొని మహిళకు..

కాశీబుగ్గ : వరంగల్ 19వ డివిజన్ పోచమ్మ ఆలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. పోచమ్మ ఆలయం వద్ద భారత్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ ప్రీతిగ్యాస్ ఏజెన్సీకి సంబంధించిన వాహనం ఢీకొట్టగా ఎండీ నసీమా రెండు కాళ్లు విరిగిపోయాయి. డ్రైవర్ గ్యాస్ డెలివరీ చేస్తుండగా క్లీనర్ వాహనాన్ని తిప్పుతున్న క్రమంలో ఈ ఘటన జరిగింది. వాహనం పక్కనే ఉన్న ఇటుకల బండిని ఢీకొట్టగా వాహనం ధ్వంసమైంది. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా, వెంటనే 108లో ఎంజీఎం దవాఖానకు తరలించారు.